వేతనాలు అందక అవస్థలు

- పంచాయతీ కార్మికులకు నెలల తరబడి తప్పని నిరీక్షణ
- నిస్సహాయ స్థితిలో అధికారులు

నూతనకల్ : గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సుమారు ఐదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీలలో సుమారు 60మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో జనాభాను బట్టి ఇద్దరు నుంచి 8మంది కార్మికుల చొప్పున పని చేస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో పారిశుద్ధ్య కార్మికుడికి రూ.8500 కనీస వేతనం అందజేస్తోంది. కానీ వీరికి వేతనాలు నెల నెలా రాక అర్ధాకలితో అలుమటిస్తున్నారు.

నిరంతరం పనులు చేస్తున్నా..

ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో చెత్తను సేకరించడంతోపాటు మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలలను శుభ్రం చేసే పనులు కూడా చేస్తున్నారు. డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్టు ఎరువులను తయారు చేస్తున్నారు. ఇంత కష్టపడుతున్నా ప్రభుత్వం జీతాలు సకాలంలో ఇవ్వడంలేదని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నూతనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నిధులు లేక..

ప్రస్తుతం పంచాయతీల్లో రెండేళ్లుగా ఎస్‌పీసీ నిధులు, ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. జనరల్ ఫండ్ కూడా లేకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదు. ఐదు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పారిశుద్ధ్య కార్మికులు విధులు కొనసాగిస్తూనే ఉన్నారు. అధికారులు స్పందించి నెల నెలా వేతనాలు అందించాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సునీతను వివరణ కోరగా.. ప్రస్తుతం రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్, ఆర్థిక సంఘం నుంచి నిధులు రాకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించలేకపోతున్నట్లు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వేతనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



కొన్నేళ్లుగా జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులను అడిగితే గ్రామ పంచాయతీలో బడ్జెట్ లేదని చెబుతున్నారు. నెల నెలా జీతం రాకపోవడంతో కార్మికులకు పూట గడవడం ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నెల నెలా జీతాలు అందజేయాలి.

– నకిరేకంటి శంభయ్య, పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు

క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే సామేల్ వినతి



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని, మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం 30 సంవత్సరాలుగా ప్రజలు ఎదురు చూశారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైందని తెలిపారు.

సమస్యలపై మంత్రి వెంకట్‌రెడ్డికి వినతి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బైరబోయిన నగేష్

అర్వపల్లి : అర్వపల్లిలో ముత్యాలమ్మ దేవాలయ రోడ్డు సీసీకి నిధులు మంజూరు చేయించాలని, నకిరేకల్–తానంచర్ల 365 హైవేపై ఫ్లైఓవర్ ఏర్పాటు యోచనను విరమించుకోవాలని కోరుతూ శుక్రవారం అర్వపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్, కోమటిరెడ్డి యువసేన నాయకుడు బైరబోయిన నగేష్ హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కూడా కలిశారు. ఈ కార్యక్రమంలో శివాజీ, మహేష్, రవీందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి

పెన్‌పహాడ్ : గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దోసపహాడ్‌కు చెందిన రైతు కొండేటి వెంకట్‌రెడ్డి(61) శుక్రవారం తన సొంత వ్యవసాయ భూమిలో వరి పొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడు గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వెంకట్‌రెడ్డి మృతికి సంతాపం

రైతు, కాంగ్రెస్ నాయకుడు కొండేటి వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, కొండేటి భిక్షంరెడ్డి, సద్దల నగేష్, నారాయణ ప్రవీణ్‌రెడ్డి, గద్దల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు కిట్లపై శిక్షణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని గీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్లపై శుక్రవారం కోడూరులో అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గీత కార్మికులకు కాటమయ్య కిట్లు అందజేసి తాడి చెట్లు ఎక్కించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆగమయ్య, టీపీసీసీ కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి బద్దం యాదగిరిగౌడ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల నిరసన

తిరుమలగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీపును హత్య చేసిన బన్నిని కఠినంగా శిక్షించాలని, ట్రాన్స్‌జెండర్లకు రక్షణ కల్పించాలని శుక్రవారం తిరుమలగిరిలో ట్రాన్స్‌జెండర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లకు మహిళలకు వర్తించే చట్టాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిహారిక, వాణి, విద్య, భావన, మల్లిక పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్

సూర్యాపేట : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మాజీ ఎమ్మెల్యే, లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ దోసపాటి గోపాల్, టెక్స్‌టైల్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండూరి శంకర్, 45వ వార్డు మాజీ కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో డబ్బు కన్నా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పేదలు ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వైద్య శిబిరంలో 1200 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి వెంకటేశ్వరరావు, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, దూలం నగేష్, కర్నాటి సురేందర్, కుమ్మరికుంట్ల లింగయ్య, తల్లాడ రామచంద్రయ్య, బెజగం ఫణి, సింగిరికొండ ప్రదీప్, పావనియాదగిరి, బజ్జూరి శ్రీనివాస్, కుక్కడపు భిక్షం, ఇస్మాయిల్ సందీప్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ బిల్లులకు ఆమోదం హర్షణీయం

భానుపురి : దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ అన్నారు. శుక్రవారం కొత్త బస్టాండ్ వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి సూచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. పది సంవత్సరాల నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలను పట్టించుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, రుద్రంగి రవి, కరీముల్లా బేగ్, బొడ్డు సాయి, అనంతుల యాదగిరి, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం, అయూబ్ ఖాన్, సిరివెళ్ల శబరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది



వేడుకల్లో పాల్గొన్న సర్వోత్తమ్‌రెడ్డి, వేణారెడ్డి

భానుపురి : రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లింలు ఎంతో నిష్ఠతో నెలంతా దీక్షలు చేస్తారని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం బాలాజీ నగర్ మదీనా మసీద్‌లో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కరీముల్లా జావిద్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు అభి మౌలానా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, రుద్రంగి రవి, గుణగంటి వంశీధర్, గోదల రంగారెడ్డి, రాపర్తి శ్రీనివాస్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, అయుబ్ ఖాన్, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఈ నెల 29వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే మాలల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా కోకన్వీనర్ గంట యాకూబ్, మండల అధ్యక్షుడు గంట సందీప్ కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో మాలల ఆత్మ గౌరవ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెరమాండ్ల జాని, మల్లయ్య, చిన్ని, నర్సయ్య, సాల్మన్, సుధాకర్, రమేష్, పుష్ప, రేణుక, దయామయి పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



అర్వపల్లిలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అర్వపల్లి : అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ కుంకుడుపాల రవీందర్, కోకన్వీనర్‌లు మచ్చ నర్సయ్య, జీడి వెంకన్న, నాయకులు ఈదురు వీరపాపయ్య, పందిరి సురేందర్, అర్వపల్లి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పలువురు నాయకుల ముందస్తు అరెస్టు

తిరుమలగిరి : రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు వెళ్తున్న కార్మికులను స్థానిక పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కడెం లింగయ్య మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల శాఖ అధ్యక్షులు పానుగంటి శ్రీను, దాసరి ప్రకాష్, నిర్మాల యాకయ్య, నగేష్ పాల్గొన్నారు.

నాగారం : ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాకు వెళ్తున్న సీపీఎం నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సీపీఎం మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి, సీఐటీయూ మండల అధ్యక్షుడు అనంతుల మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకులు..

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు నాతి బాలరాజు, కాసం పవన్, సందీప్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు..

చివ్వెంల : గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి పిలుపునివ్వడంతో శుక్రవారం మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు ధరావత్ భద్రు నాయక్, పల్లేటి నాగయ్య, భుక్యా నాగునాయక్, తదితరులు ఉన్నారు.

మద్దిరాల : అసెంబ్లీ బడ్జెట్‌లో మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల ప్రస్తావన లేకపోవడంతో చలో అసెంబ్లీకి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బర్పటి ఉపేందర్, దామెర్ల వెంకన్న, వెలుగు వెంకన్న, అక్కిరెడ్డి జ్యోతి, ఉపేందర్‌రెడ్డి, సూరారపు గౌతమి, రాజు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి గజవాహన సేవ

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి గజవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను గజవాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం దూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కూరేశం సంతోష్ కుమార్ ఆచార్యలు, ఆలయ కమిటీ సభ్యులు, డైరెక్టర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నాగారం : ఫణిగిరిలో సీతారామచంద్రస్వామిని గజవాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

గుమ్మడవెల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గుమ్మడవెల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్

మద్దిరాల : గుమ్మడవెల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, రెబ్బేని శ్రీనివాస్, మోడెం వెంకన్న, తీగల వెంకన్న, ఏపీఓ గుండు వెంకన్న, తోట రమేష్, వినోద్, హమీద్, విక్రమ్ పాల్గొన్నారు.

పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం



సూర్యాపేట : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



సూర్యాపేట : పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



పెన్‌పహాడ్ : జెడ్పీహెచ్‌ఎస్ కేంద్రంలో..



తిరుమలగిరిలో పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



నూతనకల్ : జెడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రం వద్ద..



చివ్వెంలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్

తిరుమలగిరి : పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి ఐ.శాంతయ్య మాట్లాడుతూ తిరుమలగిరిలో మూడు పరీక్ష కేంద్రాలలో 623 మంది విద్యార్థులకు గాను 621 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 179మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 177మంది హాజరయ్యారని ఎంఈఓ రాములు నాయక్ తెలిపారు. అలాగే విజయమేరి ఉన్నత పాఠశాల కేంద్రంలో 181మంది విద్యార్థులకు 180 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీలలో శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండు కేంద్రాలలో మొత్తం 290 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ బాలునాయక్ తనిఖీ చేశారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 312మంది విద్యార్థులకు గాను 312మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స్రవంతి, నకిరేకంటి రవి తహసీల్దార్ లాలు తనిఖీ చేశారు.

ఆత్మకూర్(ఎస్) : పదో తరగతి పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు 399మంది విద్యార్థులకు 399 మంది హాజరయ్యారు. నెమ్మికల్, ఆత్మకూరు పరీక్ష కేంద్రాలను సెక్టోరియల్ అధికారి జనార్దన్ తనిఖీ చేశారు. వీరి వెంట ఎంఈఓ ధారాసింగ్ ఉన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని జి.తిర్మలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొదటిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 286 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ రమణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో 150 మందికి 150 మంది, జి.తిర్మలగిరిలో 136 మందికి 133 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

పకడ్బందీగా నిర్వహించాలి..

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోని గదులను, సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణయ్య, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 660 మంది విద్యార్థులకు 659 మంది పరీక్షకు హాజరైనారు. పరీక్షా సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు.



అర్వపల్లి : జెడ్పీహెచ్‌ఎస్ వద్ద..



ఆత్మకూర్(ఎస్) : పరీక్ష కేంద్రం వద్ద..



తుంగతుర్తిలో..

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చివ్వెంల : బి.చందుపట్లలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సంతోష్ కుమార్



తుంగతుర్తి : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ దయానందం, తదితరులు



అర్వపల్లి : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గోపి, తదితరులు

చివ్వెంల : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బి.చందుపట్లలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవి దృష్ట్యా మేజర్ గ్రామ పంచాయతీలలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, జిల్లా సమాఖ్య సభ్యురాలు సిద్దోజు క్రిష్ణ వేణి, ముద్ద వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుంగతుర్తిలోని మెయిన్ రోడ్డుపై..

తుంగతుర్తి : ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం దోహదపడుతుందని తహసీల్దార్ దయానందం అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నాగారంబంగ్లాలో..

అర్వపల్లి : గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ టి.గోపి కోరారు. అర్వపల్లిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు చలివేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. వీటిలో ప్రతిరోజు చల్లటి నీటిని అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి. నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం : ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.మారయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగారంబంగ్లాలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కృష్ణకాంత్, పంచాయతీ కార్యదర్శి కె.అరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నాగారం : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య అన్నారు. నాగారంబంగ్లా గ్రామానికి చెందిన తొడుసు నాగమల్లు కుమారుడు మణికర్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతడికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.60,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శుక్రవారం మండల కేంద్రంలో జాజుల వీరయ్య లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన రాంమూర్తి, కొనిరెడ్డి మోహన్‌రెడ్డి, బయ్యం వెంకన్న, మంగదుడ్ల దశరథ, కొలిపాక సాయి, కన్నెబోయిన నాగరాజు, కన్నెబోయిన అంజయ్య, చీరిక నరేందర్‌రెడ్డి, కొనిరెడ్డి లింగారెడ్డి, పులగం సంజీవరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు బీడు భూములను సేద్యానికి అనువుగా మార్చుకోవాలి

అర్వపల్లి : రైతులు తమ బీడు భూములను ఉపాధి హామీ పథకం ద్వారా సేద్యానికి అనువుగా మార్చుకోవాలని ఎంపీడీఓ టి. గోపి అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో ఉపాధి పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్న బీడు భూములను శుక్రవారం పరిశీలించారు. భూమిని బాగు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఈ పథకం రైతులకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాములు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

లింగమంతుల స్వామి ఉత్సవాలకు విరాళం

నాగారం : మండల కేంద్రంలో ఈ నెల 23న జరిగే లింగమంతుల స్వామి ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య శుక్రవారం రూ.25,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలను యాదవులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. అనంతరం కడియం రామచంద్రయ్యను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కన్నెబోయిన వెంకటభిక్షం, లింగయ్య, శ్రీరంగం, యాకుబ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం

మద్దిరాల: ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని మామిండ్లమడవ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మామిండ్లమడవ గ్రామానికి చెందిన ఉప్పుల సోమయ్య అనే రైతు వ్యవసాయ భూమిలోని పూరిగుడిసెకు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో మంటలు అంటుకుని పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. పైపులు, వ్యవసాయ సామగ్రి, స్టార్టర్లు, పిండిబస్తాలు కాలిపోయాయని, సుమారు రూ.40వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.